


మీ ఆనందము
ఎంత గొప్పదగును
**అధ్యక్షులు హెన్రీ బి. ఐరింగ్ చేత**

# ప్రథమ అధ్యక్షత్వమందు మొదటి సలహాదారులు

జీవితంలో కొన్ని ఆనందాలు మధురంగా ఉంటాయి మరియు యేసు క్రీస్తు యొక్క పునరుద్ధరించబడిన సువార్తను వారి హృదయాలలోనికి తీసుకొనేందుకు మీరు ఇతరులకు సహాయపడ్డారని తెలుసుకోవడం కంటే ఎక్కువగా చిరకాలం నిలిచిపోతాయి. అటువంటి ఆనందాన్ని కలిగియుండడం సంఘములోని ప్రతి సభ్యునికి గల అవకాశం. మనము బాప్తీస్మము పొందినప్పుడు, "(మనము) దేవుని ద్వారా విమోచింపబడునట్లు, మరియు మొదటి పునరుత్థానము వారిలో లెక్కింపబడుటకు (మనము) నిత్యజీవము కలిగియుండుటకు, మరణము వరకు కూడా (మనము) ఉండు అన్ని సమయములలో మరియు అన్ని విషయములలో మరియు అన్ని స్థలములలో దేవునికి సాక్షులుగా నిలబడెదమని" (మోషైయ 18:9) మనము వాగ్దానము చేసాము.

వారు ఎక్కడ ఉన్నప్పటికీ, జీవించినంత కాలము యేసు క్రీస్తు సువార్తను లోకానికి చాటేందుకు సంఘానికి ఇవ్వబడిన బాధ్యతలో కొంతభాగాన్ని సభ్యులందరూ అంగీకరిస్తారు. ప్రభువు దానిని స్పష్టంగా చెప్పారు: "ఇదిగో, సాక్ష్యమిచ్చుటకును జనులను హెచ్చరించుటకును నేను మిమ్మును పంపుచున్నాను, మరియు హెచ్చరించబడిన ప్రతి మనుష్యుడు తన పొరుగువానిని హెచ్చరించుట అవసరము" (సి & ని 88:81). ఇంకను సంఘ సభ్యులు కాని వారికి బోధించడానికి పూర్తి-కాల మిషనరీలు శక్తిని కలిగియుండాలి. మిషనరీలు బోధించడానికి ప్రభువు సిద్ధపరచిన వారిని కనుగొనడానికి సంఘ సభ్యులు శక్తిని కలిగియుండాలి.

బోధించబడేందుకు మన చుట్టూ ఉన్న జనులను ప్రభువు సిద్ధపరిచారనే విశ్వాసాన్ని మనము అభ్యసించాలి. వారు ఎవరో, వారు ఎప్పుడు సిద్ధముగా ఉన్నారో ఆయనకు తెలుసు మరియు పరిశుద్ధాత్మ శక్తి ద్వారా వారి వద్దకు ఆయన మనల్ని నడిపించగలరు మరియు బోధింపబడేందుకు వారిని ఆహ్వానించడానికి మనకు మాటలను ఇవ్వగలరు. 1832లో ప్రభువు ఒక మిషనరీకి ఇచ్చిన వాగ్దానమే మిషనరీల చేత బోధింపబడేందుకు సిద్ధంగా ఉన్నవారిని కనుగొనే మన బాధ్యతలో ఆయన మనకు కూడా ఇచ్చే వాగ్దానము: "అతనిపై నేను ఆదరణకర్తను పంపెదను, అది వానికి సత్యమును, అతడు వెళ్ళవలసిన మార్గమును బోధించును. అతడు విశ్వాసముగా నుండిన యెడల, పనలతో మరల వానికి కిరీటము ధరింపజేతును" (సి & ని 79:3).

విశ్వాసముగల మిషనరీ కొరకైన గొప్ప ఆనందము యొక్క వాగ్దానము మిషనరీ కార్యము కొరకు మన హృదయాలను ఇచ్చిన విశ్వాసులైన సభ్యులుగా మనది కూడా అగును:

"మరియు ఇప్పుడు, మీరు నా తండ్రి యొక్క రాజ్యములోనికి నా యొద్దకు తెచ్చిన ఒక్క ఆత్మతో మీ ఆనందము గొప్పదైనప్పుడు, అనేక ఆత్మలను మీరు నా యొద్దకు తెచ్చినప్పుడు మీ ఆనందము ఎంత గొప్పదగును!

“ఇదిగో, మీరు మీ యెదుట నా సువార్తను, నా బండను, మరియు నా రక్షణను కలిగియున్నారు.

“మీరు పొందెదరని నమ్ముచు, విశ్వాసముతో నా నామమున తండ్రిని అడుగుడి మరియు మీరు పరిశుద్ధాత్మను కలిగియుందురు, అతడు అవసరమైన అన్ని విషయములను మనుష్యులకు విశదపరచును” (సి & ని 18: 16–18).

బోధింపబడేందుకు సిద్ధముగా ఉన్నవారిని గుర్తించి, ఆహ్వానించడానికి మనకు సహాయపడేందుకు పరిశుద్ధాత్మకు అదనముగా మనల్ని నడిపించేందుకు ప్రభువు నాయకులను పిలిచి, శిక్షణనిచ్చారు. ఫిబ్రవరి 28, 2002న ఇవ్వబడిన లేఖలో ప్రథమ అధ్యక్షత్వము బిషప్పులు మరియు వార్డులపై మిషనరీ కార్యము కొరకు అధిక బాధ్యతనుంచారు.[1] వార్డు లేక బ్రాంచి సలహాసభ సహాయముతో యాజకత్వ కార్యనిర్వాహక కమిటీ ఆ విభాగము కొరకు ఒక మిషనరీ ప్రణాళికను వృద్ధిచేస్తుంది. ఆ ప్రణాళికలో మిషనరీలచేత బోధింపబడేందుకు సిద్ధముగా ఉన్నవారిని సభ్యులు కనుగొనడానికి సూచనలుంటాయి. వార్డు లేక బ్రాంచి మిషను నాయకునిగా ఒక వ్యక్తి పిలువబడును. ఆ మిషను నాయకుడు పూర్తి-కాల మిషనరీలతో మరియు వారి పరిశోధకులతో సన్నిహిత సంబంధాన్ని కలిగియుండును.

మిషనరీల చేత బోధించబడేందుకు జనులను కనుగొనుటలో సహాయపడాలనే మీ వ్యక్తిగత బాధ్యతను మీరు బాగా నెరవేర్చడానికి అనేక మార్గాలున్నాయి. సాధారణమైన మార్గమే మంచిదవుతుంది.

పరిశుద్ధాత్మ చేత నడిపంపబడుటకు ప్రార్థించండి. వారి సలహాల కొరకు అడుగుతూ, వారికి సహాయపడతామని వాగ్దానం చేస్తూ స్థానిక నాయకులతో, మిషనరీలతో మాట్లాడండి. ఈ కార్యములో మీతోపాటు ఉన్నవారిని ప్రోత్సహించండి. మీరు చెప్పేవి మరియు చేసే వాటన్నిటిలో అన్ని సమయాల్లో యేసే క్రీస్తని మరియు దేవుడు ప్రార్థనలకు జవాబిస్తారని సాక్ష్యమివ్వండి.

మీరు ఆ నడిపింపు కొరకు ప్రార్థించి, పని చేసినట్లయితే సత్యాన్ని వెదకుచున్న వారి వద్దకు పరిశుద్ధాత్మ మిమ్మల్ని నడిపించునని నేను సాక్ష్యమిస్తున్నాను. మరియు సువార్తను వారి హృదయాలలోనికి తీసుకోవడానికి ఎన్నుకొని, విశ్వాసములో కొనసాగిన వారితో మీ ఆనందము నిలిచియుండునని అనుభవపూర్వకంగా నాకు తెలుసు.

**వివరణ**

1. “సంఘ వార్తలు: వార్డు మరియు బ్రాంచి మిషనరీ కార్యము నొక్కిచెప్పబడింది,” లియహోనా, ఆగష్టు 2002, 4 చూడుము.

**ఈ సందేశము నుండి బోధించుట**

- వారు నేర్చుకొన్న సూత్రాలను జీవించేందుకు వారికి సహాయపడేలా లక్ష్యాలుంచమని మనము బోధించేవారిని ప్రోత్సహించమని *బోధన, గొప్ప పిలుపు కాదు* మనకు సూచిస్తుంది (159వ పేజీ చూడుము). కుటుంబముతో పాటు అధ్యక్షులు ఐరింగ్ చేత చెప్పబడిన మిషనరీ కార్యము యొక్క దీవెనలను గుర్తించడం గురించి ఆలోచించుము మరియు ప్రేరేపించబడిన యెడల, సువార్తను పంచుకొనేందుకు లక్ష్యాలుంచమని కుటుంబమును ఆహ్వానించుము.
- “సాధారణ మార్గమే మంచిదగును” అనే అధ్యక్షులు ఐరింగ్ సలహాను గుర్తుంచుకొని, సువార్తను పంచుకోగల మార్గాలను కుటుంబముతో పాటు ఆలోచించుము. ఆలోచించడం గురించి ఎక్కువగా నేర్చుకొనేందుకు *బోధన, గొప్ప పిలుపు కాదు,* 160 వ పేజీ చూడుము.

## యువత

# నా జీవితంలోని అనేకమంది మిషనరీలు

**ఎలిజబెత్ ఎస్. స్టైల్స్ చేత**

మిషనరీలతో నేను సంఘానికి హాజరయిన మొదటి ఆదివారము, మా చుట్టుప్రక్కల కలిసి పెరిగిన వారిని, నాకు తెలిసిన వారిని నేను గుర్తుపట్టాను. పాఠశాలలో నా సన్నిహిత స్నేహితురాళ్ళలో ఒకరిని, ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాల కార్యదర్శులను, గతంలో నేనెన్నడూ సఖ్యతతో మెలగని ఒక అమ్మాయిని మరియు ఒకసారి నేనిష్టపడిన ఒక యువకుడిని చూసాను.

ఈ వ్యక్తులలో ప్రతి ఒక్కరు నాపై చెరగని ముద్ర వేసారు. నా సన్నిహిత స్నేహితురాలు గొప్ప నిజాయితీ గల యౌవన స్త్రీ, మరియు ఆమె వలనే నేను సంఘాన్ని పరిశోధించడం కొనసాగించదలిచాను. పాఠశాల నుండి నన్ను గుర్తుంచుకొనిన కార్యదర్శులు నేను ముఖ్యమని తెలుసుకొనేందుకు నాకు సహాయపడ్డారు. గతంలో ఆమె పట్ల దయలేని నా ప్రవర్తనను మరచి నన్ను హత్తుకొన్న యౌవన స్త్రీ నుండి దైవిక ప్రేమను, దాతృత్వాన్ని నేను నేర్చుకున్నాను. నా యౌవనపు తొలి రోజుల్లో ఇష్టపడిన యువకుడు మంచి మాదిరిగా ఉన్నాడు, నేను అతని వెలుగును గుర్తించి, అతని చుట్టుప్రక్కల ఉండాలని కోరాను.

మొదటిసారి నేను మిషనరీలను కలుసుకొనక ముందే, నా చుట్టూ ఆయన ఉంచిన మనుష్యుల ద్వారా సువార్తను పొందడానికి పరలోక తండ్రి నన్ను సిద్ధపరిచారని తెలుసుకోవడానికి ఈ అనుభవాలు నాకు సహాయపడ్డాయి. మనము చేసే చిన్న పనులు గొప్ప ప్రభావాన్ని చూపగలవని వారి నుండి నేను నేర్చుకున్నాను. అన్నిటికంటే ముఖ్యమైనది, మిషనరీ కార్యము నాతోనే మొదలవుతుందని నేను తెలుసుకున్నాను.

## పిల్లలు

# సువార్త—పంచుకొనేందుకు ఒక బహుమానము

సువార్త అనగా అర్థము యేసు క్రీస్తు మరియు ఆయన ప్రవక్తల ద్వారా మనకివ్వబడిన అన్ని బోధనలు మరియు విధులు. సువార్త అనేది పరలోక తండ్రి నుండి బహుమానాలతో నింపబడిన బుట్ట వంటిది. ఈ బహుమానాలను ఇతరులకివ్వడానికి మీరు సహాయపడవచ్చు. సువార్త బహుమానాన్ని మీరు ఎవరితో పంచుకోగలరు?

ఈ లేఖన వచనాలలో ప్రతిదానిని చదువుము మరియు సువార్తలో ఇమిడియున్న కొన్ని బహుమానాలను జాబితా చేయుము లేక బొమ్మలు గీయుము.

1. యాకోబు 5: 14–15
2. మోషైయ 16: 6–7
3. 3 నీఫై 18: 1–10
4. సి & ని 20: 72–73
5. సి & ని 33: 16
6. సి & ని 89: 4, 18–21
7. సి & ని 132: 46
8. సి & ని 137: 10
9. సి & ని 138: 32–34

© 2011 by Intellectual Reserve, Inc. అన్ని హక్కులు కలిగియున్నది. భారతదేశంలో ముద్రించబడినది.
ఆంగ్ల ఆమోదము: 6/10. Translation of *First Presidency Message, February 2011*. అనువాద ఆమోదము: 6/10. ఫిబ్రవరి 2011. ప్రథమ అధ్యక్షత్వ సందేశము యొక్క అనువాదము. Telugu. 09762 421

# అన్ని విషయాల పునఃస్థాపన

*ఈ సందేశాన్ని చదువుము మరియు మీరు దర్శించే సహోదరీలతో తగినవిధంగా దీనిని చర్చించుము. మీ సహోదరీలను బలపరిచేందుకు మరియు మీ స్వంత జీవితంలో ఉపశమన సమాజాన్ని ఒక క్రియాశీలక భాగంగా చేయడానికి మీకు సహాయపడేందుకు ప్రశ్నలను ఉపయోగించుము.*

విశ్వాసము
కుటుంబము • ఉపశమనము

ప్రవక్త జోసెఫ్ స్మిత్ ఉపశమన సమాజాన్ని సంఘము యొక్క ఆవశ్యక భాగంగా ఏర్పాటుచేసారు. మీ జీవితంలో ఉపశమన సమాజము ఎందుకు ఆవశ్యకమైనదో గ్రహించేందుకు అధ్యక్షత్వముగా మేము మీకు సహాయపడగలమని ఆశిస్తున్నాము.

క్రొత్త నిబంధన స్త్రీలు యేసు క్రీస్తు నందు విశ్వాసాన్ని చూపారని, ఆయన కార్యములో పాల్గొన్నారని మనకు తెలుసు. "యేసు పాదముల యొద్ద కూర్చుండి, ఆయన బోధ వినిన" మరియ గురించి లూకా 10:39 చెప్పును. యోహాను 11:27 లో మార్తా క్రీస్తు గురించి సాక్ష్యమిచ్చును: "ఆమె—అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నానని ఆయనతో చెప్పెను." అపొస్తలుల కార్యములు 9:36, 39 "తబితా అనబడే ఒక ప్రత్యేక శిష్యురాలి గురించి చెప్పును, . . . సత్కార్యములతో నిండినది. . . . విధవరాండ్రందరు వచ్చి నిలబడి . . . (ఆమె) కుట్టిన అంగీలను వస్త్రములను చూపుచుండెను." రోమా 16:1–2 లో ఫీబే "సంఘ పరిచారకురాలు" మరియు "అనేకులకు సహాయకురాలైయుండెను."

విశ్వాసము, సాక్ష్యము మరియు సేవ యొక్క ఈ మాదిరులు కడవరి-దిన సంఘములో కూడా కొనసాగాయి మరియు ఉపశమన సమాజము యొక్క ఏర్పాటుతో పరిశుద్ధపరచబడ్డాయి. ఉపశమన సమాజ ప్రధాన అధ్యక్షురాలైన జూలీ బి. బెక్ బోధించారు: "క్రొత్త నిబంధన కాలములో రక్షకుడు ఆయన కార్యములో పాల్గొనేందుకు మరియ, మార్తాలను ఆహ్వానించినట్లే, ప్రభువు యొక్క కార్యమందు పాల్గొనుటకు ఈ యుగపు స్త్రీలు అధికారిక బాధ్యతను కలిగియున్నారు. . . . 1842లో ఏర్పాటు చేయబడిన ఉపశమన సమాజము స్త్రీల సంఘటిత శక్తిని మరియు ప్రభువు రాజ్యమును నిర్మించుటకు వారి ప్రత్యేక నియామకములను సమకూర్చినది."[1]

మనము ఉపశమన సమాజ ఉద్దేశాలైన విశ్వాసమును, వ్యక్తిగత నీతిని వృద్ధిచేయడం, కుటుంబాలను మరియు గృహాలను బలపరచడం, అవసరతలోనున్న వారిని వెదకి, వారికి సహాయపడడం వంటి వాటిపై కేంద్రీకరించినప్పుడు మన కార్యమును మనము సాధిస్తాము.

రక్షణ కార్యములో సహాయపడేందుకు ఉపశమన సమాజము దైవికముగా ఏర్పాటు చేయబడినదని నేను సాక్ష్యమిస్తున్నాను. ఈ పరిశుద్ధ కార్యమును సాధించడంలో ఉపశమన సమాజపు ప్రతి సహోదరి ఆవశ్యక పాత్రను పోషించాలి.

***సిల్వియా హెచ్. ఆల్రెడ్, ఉపశమన సమాజ ప్రధాన అధ్యక్షత్వమందు మొదటి సలహాదారిణి.***

## *లేఖనముల నుండి*

యోవేలు 2:28–29; లూకా 10:38–42; ఎఫెసీయులకు 1:10

## *మన చరిత్ర నుండి*

"ఉపశమన సమాజము పునఃస్థాపనలో అధికారిక భాగమని ప్రవక్త జోసెఫ్ స్మిత్ ద్వారా మనమెరుగుదుమని" సహోదరి జూలీ బి. బెక్ బోధించారు.[2] 1820లో మొదటి దర్శనముతో పునఃస్థాపన కార్యము మొదలైంది మరియు "ఆజ్ఞ వెంబడి ఆజ్ఞ, సూత్రము వెంబడి సూత్రము" (సి & ని 98:12) కొనసాగింది. 1842, మార్చి 17న ఉపశమన సమాజము అధికారికంగా ఏర్పాటు చేయబడినప్పుడు, పునఃస్థాపించబడిన సంఘములో వారి ఆవశ్యక స్థానము గురించి ప్రవక్త స్త్రీలకు బోధించారు. "స్త్రీలు ఈ విధంగా ఏర్పాటు చేయబడేవరకు సంఘము ఎన్నడూ సంపూర్ణంగా ఏర్పాటు చేయబడలేదని" ఆయన అన్నారు.[3]

**వివరణలు**

1. జూలీ బి. బెక్, "ఉపశమన సమాజ ఉద్దేశమును నెరవేర్చుట," *లియహోనా*, నవ. 2008, 108.
2. జూలీ బి. బెక్, "ఉపశమన సమాజ ఉద్దేశమును నెరవేర్చుట," 108.
3. *సంఘాధ్యక్షుల బోధనలు: జోసెఫ్ స్మిత్* (2007), 451.

### నేనేమి చేయగలను?

1. యేసు క్రీస్తు యొక్క శిష్యురాళ్ళ విశ్వాసాన్ని ప్రతిబింబించేలా ఈ నెలలో నా సహోదరీలకు నేను ఎటువంటి సహాయాన్ని అందించగలను?
2. ఈ నెలలో నా సాక్ష్యాన్ని బలపరచుకోవడానికి పునఃస్థాపించబడిన సువార్త యొక్క ఏ బోధనను నేను చదివెదను?

అదనపు సమాచారము కొరకు, www.reliefsociety.lds.org చూడుము.

© 2011 by Intellectual Reserve, Inc. అన్ని హక్కులు కలిగియున్నది. భారతదేశములో ముద్రించబడినది. ఆంగ్ల ఆమోదము: 6/10. Translation of *Visiting Teaching Message, February 2011*. అనువాద ఆమోదము: 6/10. ఫిబ్రవరి 2011, దర్శించి బోధించు సందేశము యొక్క అనువాదము. Telugu. 09762 421